తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

మార్చి 3వరకు పుష్కరిణిలో స్నానాలు రద్దు

-భక్తులకు టిటిడి సూచన

తిరుమల,పిబ్రవరి 20ప్రభాతవార్తప్రతినిధి: తిరుమలేశుని తెప్పోత్సవాలు ఆరంభానికి ముందే నేటి నుండి మార్చి 3వతేదీ వరకు స్వామిపుష్కరిణిలో భక్తులకు స్నానాలు టిటిడి రద్దుచేసింది. భక్తులు ఈ విషయాన్ని గమనించి టిటిడికి సహకరించాలని విజ్ఞప్తి చేసింది. ఈనెల 26నుండి జరిగే తిరుమలేశుని తెప్పోత్సవాలకు సంబంధించి కొన్ని కార్యక్రమాలు చేపడుతున్నందున, పుష్కరిణిలో తెప్ప సిద్ధమవడంతో పవిత్రంగా భావించేందుకు పుష్కరిణిలో స్నానాలు శుక్రవారం నుండి రద్దుచేశారు.

వేసవి రద్దీపై సమీక్ష

తిరుమల,పిబ్రవరి 20ప్రభాతవార్తప్రతినిధి: రానున్న వేసవి సెలవుల్లో విపరీతంగా ఉండే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పక్కా ప్రణాళికతో సమర్థవంతంగా చేపడుతున్నట్లు టిటిడి అదనపు ఈఓచిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి తెలిపారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు అన్నప్రసాదం, తాగునీటి పంపిణీ, నడక దారి భక్తులకు మార్గమధ్యంలో షెడ్ల ఏర్పాటు,, మాడ వీధులు తదితర ప్రాంతాల్లో కూల్ పెయింటింగ్, అవసరమైన చోట్ల షెడ్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

వైభవంగా శ్రీకాళహస్తీశ్వరుని ధ్వజావరోహణం

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 20 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో శుక్రవారం స్వామి ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగిసాయి. ప్రతి ఏటా నిర్వహించే బ్రహ్మోత్సవాలు 13రోజుల పాటు జరుగుతాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం పట్టణంలో కెడియం ఉత్సవం సాగింది. ఈ ఉత్సవంలో భోళాశంకరుడు శ్రీకాళహస్తీశ్వరుడు సోమాస్కంద మూర్తిగా (గంగాదేవి సమేతుడై) దేవేరి పార్వతి దేవి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారుగా పురప్రదర్శన జరిపిన తరువాత ఆలయంలో స్వామి వారి గర్భగుడి ఎదురుగా పంచమూర్తుల్ని నాలుగుదిక్కుల్లో ప్రతిష్టించారు. వెండిపల్లకిలో భోళాశంకరుని, దేవేరి జ్ఞానప్రసూనాంబ అమ్మవారిని పడమటి ఉత్తరాభిముఖులై ప్రతిష్టించగా ఎదురుగా ధ్వజస్థంభం తూర్పు అభిముఖంగా దర్శనమిచ్చింది. అలాగే ఉత్తరాభిముఖంగా వల్లదేవసేన సమేత సుబ్రమణ్యం స్వామిని దక్షిణాభిముఖంగా వినాయకుని ప్రతిష్టించారు. వేదపండితులు అర్థగిరి సారధ్యంలో వేదమంత్రాల్ని పఠిస్తుండగా ఆలయ ప్రధానాచార్యులుడాక్టర్ ఎస్ఎంకె స్వామినా ధన్, ఆలయ ప్రధానార్చకులు సంబంధం గురుకుల్, కరుణాకర్ గురుకుల్ శాస్త్రోక్తంగా హోమాలు,కలశాల్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. అనంతరం ధ్వజస్థంభంపై భక్తులు సమర్పించిన చీరల్ని దించేశారు.ఈ ఏడాది నాలుగు వేల చీరల్ని భక్తులు సమర్పించారు.ధ్వజావరోహణం కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టె సాయి ప్రసాద్,ధర్మకర్తల మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అర్చకులు వేదపండితులకు ఆలయ మర్యాదలతో 16మూరల పంచెలను అందించారు. ధ్వజావరోహణకు పట్టణానికి చెందిన మహిళా భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు.ఏర్పాట్లను ఇఇ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షణలో టెంపుల్ ఇన్స్పెక్టర్లు సుదర్శనం, వెంకటస్వామి,నాగభూషనం యాదవ్ ఆలయ ఎఇఒ విద్యాసాగర్‌రెడ్డి పర్యవేక్షించారు.

సింహాసనంపై శివయ్య రాజసం

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 20 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి గ్రామోత్సవం కన్నుల పండువగా సాగింది. ఉదయం నుంచి ఆలయంలో ఎడతెరిపి లేని పూజలు,సేవలు నిర్వహించారు. రాత్రి ధ్వజావరోహణం తరువాత గ్రామోత్సవం నిర్వహించారు. స్వామి అమ్మవార్లను చక్కగా అలంకార మండపంలో ముస్తాబు చేసారు. ఆలయ అలంకార గురుకుల్స్ రాజేస్,సురేష్‌లు స్వామి అమ్మవార్లను ముస్తాబు చేయగా ఆలయ అభిషేక గురుకుల్ డాక్టర్‌స్వామి నాథన్ పూజలుజరిపి గ్రామోత్సవానికి సాగనంపారు. వాహనాల మండపం వద్ద సోమాస్కందమూర్తి శ్రీకాళహస్తీశ్వరుని సింహాసనం వాహనంలో ప్రతిష్టించారు. అలాగే అమ్మవారిని కామధేను వాహనంలో ప్రతిష్టించారు. ఆలయ ఇన్స్పెక్టర్, ఉత్సవాల గ్రామోత్సవం ఇన్‌చార్జి వెంకటస్వామి,పర్యవేక్షకుడు నాగభూషణం యాదవ్, దఫేదార్ దామోదర్,రాజాల పర్యవేక్షణలో అంగరంగ వైభవంగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

ఇక సూత్రదారులే తరువాయి!

-"కల్తీనెయ్యి"లో విచారణకు దినేశ్‌కుమార్‌తో ఏకసభ్యకమిటీ

తిరుమల,పిబ్రవరి 20ప్రభాతవార్తప్రతినిధి: గత వైసిపి హయాంలోని టిటిడి బోర్డు ఆధ్వర్యంలో తిరుమలకు కల్తీనెయ్యి వ్యవహారంలో అసలు సూత్రదారులెవరనేది తెరపైకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం విశ్రాంత ఐఏఎస్ అధికారి దినేష్‌కుమార్‌తో ఏకసభ్యకమిటీ నియమించింది. ఈ కమిటీలో ఆయన బాధ్యతలు చేపట్టాక ఇదివరకే ఈ వ్యవహారంపై సిబిఐ సిట్ ఇచ్చిన నివేదికతో పూర్తిస్థాయిలో మరింత సమగ్రంగా 45రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నారు. తిరుమల లడ్డూలకు కల్తీనెయ్యి సరఫరా జరిగిన కేసులో ఇప్పుడు ఏం వెలుగుచూడనుందనేది మాత్రం సంచలనమే. ఈ కేసులో పాత్రధారులను తేల్చిన సిట్ అధికారులు సూత్రధారుల జోలికెళ్ళకపోవడంతోనే ఏకసభ్యకమిటీ నియామకం చేసింది. కల్తీనెయ్యి బాగోతంలో టెండర్ నిబంధనలు మార్చి వారికి అనుకూలంగా తయారుచేసుకోవడం, ఆపై కల్తీనెయ్యిగా గుర్తించినా రద్దుచేయకపోవడం వంటివి ఇప్పుడు కీలకంగా దర్యాప్తు సాగనుంది. ఇందుకు రాష్ట్రప్రభుత్వం, మంత్రిమండలి స్వయంగా ఏకసభ్యకమిటీని నియమించేందుకు సిద్ధమైంది. ఇక ఏకపక్ష కమిటీ దినేశ్‌కుమార్ తనదైన శైలిలో దర్యాప్తు చేపడితే ఎలాంటి పరిణామాలు చోటుచేసుకోబోతున్నాయనేది మాత్రం అందరిలోనూ ఆందోళనకరంగా మారింది. 2019-2024 మధ్యకాలంలో కల్తీ నెయ్యి సరఫరా చేసినా పాపంలో కీలక సూత్రధారులను తేల్చేందుకు ఇప్పుడు ఆయనపై ఎంతైనా ఉంది.

పుష్పపల్లకిపై ఊరేగిన కాళభైరేశ్వరుడు



తవణంపల్లె, మార్చి 20 ప్రభాతవార్త: మండల కేంద్రం తవణంపల్లెలో వెలసిన శ్రీకాళభైరేశ్వరస్వామివారి దేవస్థానంలో జరుగుతున్న మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు శుక్రవారం స్వామివారికి పుష్పపల్లకి సేవను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు.ఈ నెల 12 నుండి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు జరుగుతున్న విషయం విదితమే. ఇందులో భాగంగా శుక్రవారం ధ్వజావరోహణం, పుష్పపల్లకి సేవను నిర్వహించారు. ఈకార్యక్రమానికి స్థానిక భైరేశ్వరకాలనికి చెందిన బోయళ్ళు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈమేరకు ఆలయ అర్చకులు ఉత్సవాల ప్రారంభం సందర్భంగా ధ్వజస్థంభంపై ఎగురవేసిన భైరవపటాన్ని ఉదయం ధ్వజస్థంభంకు ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం అవతనం చేశారు. తిరిగి రా త్రి అలంకరించిన స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించిన పల్లకిపై వుంచి వివిధ రకాల వాయిద్యాలు, సాంస్కృతిక ప్రదర్శనల నడుమ గ్రామపురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ యువజనసంఘం సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు. ఆలయంలో ఆదివారం జరిగిన ధ్వజావరోహణం, పుష్పపల్లకిసేవ కార్యక్రమాలతో ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి.

వరిగడ్డి ట్రాక్టర్ దగ్ధం

కార్వేటినగరం,ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: కార్వేటినగరానికి కూతవేటు దూరంలో ఓ వరిగడ్డి ట్రాక్టరు అగ్నికి ఆహుతైంది.ట్రాక్టరు డ్రైవర్ మార్క్ కథనం మేరకు వివరాలిలా వున్నాయి.పిచ్చాటూరు మండలం రామగిరికి చెందిన బాబుమొదలి అనేవ్యక్తి ట్రాక్టర్ ద్వారా వరగడ్డి వ్యాపారం చేసేవారు.శుక్రవారం ఉదయం 8.30 గంటల ప్రాంతంలో కార్వేటినగరం డైట్‌మార్గంలోని శ్రీలక్ష్మీశ్రీనివాస్ లే-అవుట్‌లో వరిగడ్డి మోపులు విక్రయించడానికి వెళ్ళారు.డ్రైవర్ పైనున్న విద్యుత్‌తీగలను చూడకుండా ట్రాక్టర్ నడపడంతో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగింది.మంటలను తెలుసుకున్న డ్రైవర్ చాకచక్యంగా తప్పించుకున్నారు.డ్రైవర్‌కు చిన్నచిన్న గాయాలు తప్ప ఏ ప్రమాదం లేదు.ట్రాక్టర్‌లో 78 వరగడ్డి మోపులు ఉన్నట్లు చెప్పారు.ఒక మోపు రూ॥ 210లకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. కార్వేటినగరం యూత్,గ్రామస్థులు మంటలను కొంత వరకు అదుపుచేశారు.అనంతరం పుత్తూరు అగ్నిమాపకదళం ద్వారా పూర్తిగా మంటలను ఆర్పివేశారు.మంటల్లో వరిగడ్డి,ట్రాక్టర్,ట్రాలీ కాలిపోవడంతో యజమానికి లక్షల్లో నష్టం వాటిల్లింది.

ఇళ్ల దొంగతనాలకు చెక్...

ఎస్పీ ఆదేశాలతో ఎల్ హెచ్ ఎం ఎస్ కెమెరాల ఏర్పాటు..

రేణిగుంట ఫిబ్రవరి 20 ప్రభాతవార్త తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు సూచనలతో రూరల్ సీఐ మంజునాథరెడ్డి పర్యవేక్షణలో గాజులమండ్యం ఎస్సై నాగరాజు నేతృత్వం నందు రేణిగుంట రూరల్ సర్కిల్ పరిధిలో ఏపీ ఎల్ హెచ్ ఎం ఎస్ కెమెరాల ఏర్పాటుకు పోలీసులు శుక్రవారం శ్రీకారం చుట్టారు. మండలంలోని జీపాలెం పంచాయతీ కుర కాలవ పద్మా నగర్ కొత్త కాలనీలో ఓ కుటుంబం షిరిడికి వెళ్తున్న నేపథ్యంలో కుటుంబ సభ్యులు ఎల్ హెచ్ ఎం ఎస్ యాప్ ద్వారా విషయాన్ని తెలియజేశారు. జిల్లా ఎస్పీ కార్యాలయ సిసి కెమరా మానిటరింగ్ సెక్షన్ నుండి వచ్చిన ఆదేశాల తో గాజులమండ్యం పోలీసులు హుటాహుటిన తిరుపతి ఎస్పీ కార్యాలయం నుండి ఎల్ హెచ్ ఎం ఎస్ కెమెరాను తెచ్చి బిగించారు. ఈ సందర్భంగా డిఎస్పి శ్రీనివాసరావు ప్రభాతవార్త ప్రతినిధితోమాట్లాడుతూ జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు దొంగతనాలు జరక్కుండా చేయాలన్న దృఢ సంకల్పంతో ఉన్నారన్నారు. గతంలో ఎల్ హెచ్ ఎం ఎస్ యాప్ ద్వారా కెమెరాలను అమర్చి దొంగతనాలకు అవకాశం లేకుండా చేసేవారన్నారు. మరల ఎస్పీ సుబ్బరాయుడు దొంగతనాలు అరికట్టడంపై దృష్టి సారించారని తెలిపారు. వేసవి సెలవుల్లో, కార్యాలకు, తీర్థయాత్రలకు ఇంటికి తాళం వేసి ఊళ్ళకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా ఎల్ హెచ్ ఎం ఎస్ యాప్ ను వినియోగించుకొని ఇంటిని పరిసర ప్రాంతాలను పోలీసుల నిఘా నేత్రం పర్యవేక్షణలో ఉంచాలన్నారు. అందుకోసం గూగుల్ ప్లే స్టోర్ లోకి వెళ్లి ఏపీ ఎల్ హెచ్ ఎం ఎస్ యాప్ ను డౌన్లోడ్ చేసుకుని యాప్ ద్వారా సమాచారాన్ని పొందుపరిస్తే వెంటనే ఎస్పీ కార్యాలయంలోని సీసీ కెమెరాల మానిటర్ వ్యవస్థ అందుబాటులోకి వచ్చి స్థానిక పోలీసుల ద్వారా ఇళ్లకు ఎల్ హెచ్ ఎం ఎస్ కెమెరాలు బిగిస్తారని తెలిపారు. అవకాశాన్ని వినియోగించుకొని దొంగల ఆట కట్టించాలన్నారు.

పీహెచ్‌సికి ఎస్‌బిఐ చేయూత

రూ. 3లక్షల విలువైన వైద్య పరికరాలు వితరణ

తిరుపతి విద్య, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రేణిగుంట బ్రాంచ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ. 3లక్షల విలువగల వైద్య సంబంధిత పరికరాలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ రీజనల్ మేనేజర్ మాట్లాడుతూ ఎస్ బి ఐ సామాజిక బాధ్యతగా పీ హెచ్ సి కి పలు విలువైన పరికరాలను అందజేసినట్లు తెలిపారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో వైద్య సంబంధిత పరికరాలు కంప్యూటర్లు, ప్రింటర్లు,రక్తపోటు కొలిచే యంత్రాలు, గ్లూకోమీటర్లు, థర్మామీటర్లు తదితర అవసరమైన పరికరాలను ఆరోగ్య కేంద్రానికి అప్పగించినట్లు తెలిపారు. పీ హెచ్ సి వైద్యులు మాట్లాడుతూ అందించిన పరికరాలతో రోగుల రికార్డులను డిజిటల్గా నిర్వహించేందుకు సులభమవుతుందని, పరీక్షలు వేగంగా నిర్వహించడంతో పాటు చికిత్స నాణ్యత మరింత మెరుగవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ రీజనల్ మేనేజర్ ఎస్ వెంకటేశ్వర రావు, శ్రీనివాస్, బ్యాంకు ప్రతినిధులు, డాక్టర్ చక్రపాణి, వైద్య సిబ్బంది, స్థానికుల పాల్గొన్నారు.

జిల్లా పోలీసులకు అపోలో గ్రూప్ ధర్మల్ డ్రోన్ వితరణ

చిత్తూరు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: జిల్లా పోలీసుల ఆధునిక నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ రూ.6.5 లక్షల విలువైన అత్యాధునిక హంగులతో కూడిన ధర్మల్ డ్రోన్‌ను శుక్రవారం అపోలో గ్రూప్ సంస్థల చైర్మన్, ది అపోలో యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ ప్రతిప్ సి.రెడ్డి ఎస్పీ తుషార్ డూడికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ ప్రస్తుతం పోలీసు శాఖకు అదించిన డిజెఐ మాట్రిస్ 4టి ఆధునాతన థర్మల్ డ్రోన్, అత్యున్నత రిజల్యూషన్ థర్మల్ ఇమేజింగ్, ఆర్‌టికె సాంకేతికతతో కూడిన కచ్చితమైన లోకేషన్ ట్రాకింగ్, మల్టీ సెన్సార్ కెమెరా వ్యవస్థ, 40 నిముషాల వరకు నిరంతర ఫ్లైట్ సామర్థ్యం, 360 డిగ్రీల అడ్డంకుల గుర్తింపు వంటి ఆధునిక ఫీచర్లతో ప్రజల భద్రతకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రాత్రి వేళల్లో ధర్మల్ కెమెరా ద్వారా అనుమానస్పద కదలికలను గుర్తించడం, అటవీ, కొండ ప్రాంతాల్లో నిఘా నిర్వహించడం, శోధన, రక్షణ కార్యక్రమాల్లో బాధితులను వేగంగా గుర్తించడం, ప్రమాదాల సమయంలో హైఇంటెన్సిటీ లైట్, లౌడ్ స్పీకర్ వంటి అదనపు ఉపకరణాల సహాయంతో సమర్థవంతమైన చర్యలు చేపట్టడం సాధ్యమవుతుందన్నారు. పోలీసు శాఖ అవసరాలను గుర్తించి అత్యాధునిక సాంకేతిక సహకారం అదించిన అపోలో సంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డికి ఎస్పీ తుషార్ డూడి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పురమిత్ర ఫిర్యాదులు వెంటనే పరిష్కరించండి

కమిషనర్ మౌర్య

తిరుపతి, పిబ్రవరి 20 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పురమిత్ర యాప్ ద్వారా ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. పురమిత్ర యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను శుక్రవారం సాయంత్రం ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, ఆరోగ్య శాఖ అధికారులతో కలసి ప్రకాశం పార్క్, శివశక్తి కళ్యాణ మండపం, తదితర ప్రాంతాలను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలిపేందుకు మునిసిపల్ శాఖ పురమిత్ర యాప్ ను ప్రవేశపెట్టిందని అన్నారు. ఈ యాప్ ద్వారా ప్రజల నుండి వచ్చిన సమస్యలను, ఫిర్యాదులను ఆయా విభాగాల అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని తెలిపారు ముఖ్యంగా చెత్తకుప్పలు, డ్రైనేజీ కాలువల మరమ్మతులు, రోడ్లపై గుంతలు, అనధికారిక భవన నిర్మాణాలు వంటి ఫిర్యాదులు ఎక్కువ వస్తున్నాయని తెలిపారు. ఆయా విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. స్వర్ణ వార్డులో కార్యదర్శుల హాజరు నమోదు, రికార్డులను పరిశీలించారు. కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. పురమిత్ర యాప్ ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ. మధు, శిల్ప, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సిపి బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యధర్శిగా జనార్ధన్ యాదవ్

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బి.సి.సెల్ రాష్ట్ర ప్రధాన కార్యధర్శిగా చెరుకుల జనార్ధన్ యాదవ్‌ను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతిరూరల్ మండలం వేదాంతపురం పంచాయతికి చెందిన చెరుకుల జనార్ధన్ యాదవ్ ప్రస్తుతం ఆ గ్రామ పంచాయతీకి గ్రామ సర్పంచ్‌గా సేవలు అందిస్తున్నారు. గతంలో ఉప సర్పంచ్‌గా, ఎంపిటిసి సభ్యుడిగా పనిచేసి గ్రామ స్థాయి నుంచి ప్రజాసేవలో తనదైన ముద్ర వేసుకున్నారు. గ్రామీణ సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర, బి.సి.వర్గాల సంక్షేమంపై స్పష్టమైన వైఖరి, క్షేత్రస్థాయిలో నాయకత్వ లక్షణాలు ఆయన్ను రాష్ట్రస్థాయి బాధ్యతలకు తీసుకువచ్చాయని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. జనార్ధన్ నియామకంతో బి.సి.వర్గాలకు పార్టీ మరింత ప్రాధాన్యత ఇస్తోందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. సామాజిక న్యాయం, రాజకీయ భాగస్వామ్యం అనే సిద్ధాంతాలను బలోపేతం చేసేదిశగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు నేతలు తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు కార్యకర్తలు జనార్ధన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జనార్ధన్ యాదవ్ మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు.

టిటిడి విద్యా సంస్థల్లో ఉమ్మడి జిల్లా విద్యార్థులకు ప్రాధాన్యత ఇవ్వండి

జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమాద్రి యాదవ్

తిరుపతి విద్య, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త టిటిడి విద్యా సంస్థల్లో 202827 విద్యాసంవత్సరానికి నిర్వహించనున్న అడ్మిషన్స్‌లలో జూనియర్, డిగ్రీ కాలేజీలలో ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యార్థులకు ప్రాధాన్యత ఇవ్వాలని జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు హేమాద్రి యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు టీటీడీ జేఈఓ డక్టర్ శరత్ ను ఆయన శుక్రవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీటీడీ ఆధ్వర్యంలో తిరుపతిలో నడుస్తున్న డిగ్రీ కళాశాలలో, జూనియర్ కళాశాలలో గతంలో ప్రతి సంవత్సరం నూతనంగా చేపట్టే అడ్మిషన్లలో స్థానిక ఉమ్మడి జిల్లా విద్యార్థులకు ప్రాధాన్యత ఇచ్చి తర్వాత రాయలసీమ జిల్లాల విద్యార్థులకు మిగిలిన సీట్లను కేటాయించేవారని తెలిపారు. కానీ ప్రస్తుతం టీటీడీ కాలేజీల్లోని రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి అన్ని జిల్లాల విద్యార్థులకు కేటాయించడం వలన స్థానికంగా ఉన్నటువంటి ఉమ్మడి జిల్లా విద్యార్థులకు దక్కకుండా ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆవేధన వ్యక్తం చేశారు. తిరుపతిలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల లేకపోవడం వలన ఈ జిల్లాలోని చుట్టుపక్కల నియోజకవర్గాలకు చెందిన పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులు తిరుపతిలో చదువుకోవాలని ఆకాంక్షతో ఉన్నప్పటికీ వారికి ఇక్కడ అడ్మిషన్స్ దొరక్క అప్పులు చేసి ప్రైవేట్ కళాశాలలో ప్రైవేట్ విద్యను పొందుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు గార్లపాటి శ్రీధర్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో ఆర్యవైశ యువజన సంఘం అధ్యక్షులు



తిరుచానూరు ఫిబ్రవరి 20 ప్రభాతవార్త శ్రీ పద్మావతి అమ్మవారిని శుక్రవారం రాష్ట్ర ఆర్యవైశ యువజన సంఘం అధ్యక్షులు శబరీష్ అమ్మవారి కుంకుమార్చన సేవలో పాల్గొన్నారు. వీరికి తిరుపతి ఆర్యవైశ యువజన సంఘం అధ్యక్షులు వికాస్, తిరుచానూరు ఆర్యవైశ్య యువకిరణాల అధ్యక్షుడు కళ్యాణ్ స్వాగతం పలికి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు

సేవా ట్రస్ట్‌లు సమాజానికి అవసరం

-కమ్మవారి నిత్యాన్నదాన ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం

-దీపా వెంకట్,దగ్గుమళ్ళ ప్రసాద్‌రావులు

కాణిపాకం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: సేవా ట్రస్ట్‌లు సమాజానికి అవసరమని మాజీ ఉపరాష్ట్రపతి కుమార్తె,స్వర్ణ భారత్ ట్రస్ట్ నిర్వహకులు దీపా వెంకట్, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద్‌రావులు అన్నారు.శుక్రవారం కాణిపాకంలో అధునాతన వసతులతో నూతనంగా నిర్మించిన శ్రీవరసిద్ధి వినాయకస్వామి కాకతీయ కమ్మభవన్‌ను దీపా వెంకట్, దగ్గుమళ్ళ ప్రసాద్‌రావులు చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురుజాల జగన్మోహన్, కలికిరి మురళీమోహన్ తదితరులతో కలసి ప్రారంభించారు. ఈసందర్భంగా స్థానిక ద్రితి కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఆత్మీయ అభినందన సభలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సేవా ట్రస్ట్‌లు సమాజానికి అవసరమని తెలిపారు. అలాగే ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో కాకతీయ కమ్మవారి నిత్యాన్నదాన ట్రస్ట్ ద్వారా అందిస్తున్న సేవలు ప్రసంశనీయమన్నారు. ఈట్రస్ట్ అన్ని కులాలు, వర్గాల వారికి సూర్తిదాయకమన్నారు.ఇదే తరహాలో కాణిపాకంలో భక్తుల సౌకర్యార్థం అన్ని కులాలకు సంభందించి నిత్యాన్నదాన సత్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. కమ్మవారి నిత్యాన్నదాన ట్రస్ట్ తమ సేవలను విస్తృత పరచి అన్ని వర్గాల వారి విద్యాభివృద్ధికి సహకారం అందించాలని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు సూచించారు.ముఖ్యంగా దేశంలో స్వచ్ఛంధ సేవాసంస్థలు కీలకంగా పనిచేస్తుండడం శుభపరిణామమన్నారు. ఈసందర్భంగా ట్రస్ట్ నిర్వహకులు మాట్లాడుతూ తమ ట్రస్ట్‌కు ప్రభుత్వం స్థలం కేటాయిస్తే తమ సేవలను మరింతగా విస్తృత పరుస్తామన్నారు. అలాగే స్వర్ణ భారత్ ట్రస్ట్ ద్వారా పూతలపట్టు నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మురళీమోహన్ కోరారు. ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెళ్ల బ్రహ్మం చౌదరి, రాష్ట్ర కమ్మసంఘం అధ్యక్షులు మురళీకృష్ణ,కాణిపాకం ఆలయ చైర్మన్ మణినాయుడు, పారిశ్రామికవేత్తలు రాజేంద్రనాయుడు, ఈశ్వరనాయుడు, చంద్రప్రకాస్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సునీల్‌చౌదరి, ఐరాల జడ్పీటీసీ సుచిత్ర, కమ్మసంఘం నాయకులు మధుసూధన్‌రావు, వేణుగోపాల్‌నాయుడు,గిరిధర్‌బాబు, ఎం.మనోహర్‌నాయుడు, శేషాద్రినాయుడు,మోహన్‌నాయుడు, లంకిపల్లె మోహన్‌బాబు, నవీన్, సి.మధుబాబు, డిల్లీబాబు,హేమాద్రినాయుడులతో పాటు ట్రస్ట్ నిర్వహకులు, కమ్మసంఘం నాయకులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలోనే చిత్తూరు అభివృద్ధి

ఎంపీ, దగ్గుమళ్ళ, ఎమ్మెల్యే గురజాల

చిత్తూరు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:

కూటమి ప్రభుత్వంలోనే చిత్తూరు నగరంలో విస్తృతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు అన్నారు. చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోని పలు వార్డుల్లో శుక్రవారం ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు ప్రారంభించారు. ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు నగర పరిధిలో రూ.49.35 లక్షలతో చేపట్టి పూర్తి చేసిన అభివృద్ధి పనులకు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా 46వ డివిజన్ పట్రాంపల్లిలో రూ.5 లక్షలతో ఏర్పాటు చేసిన బోరు, మోటరును ప్రారంభించగా, పట్రాంపల్లి హెడబ్ల్యూ, బిసీ కాలనీల్లో రూ.18.65 లక్షలతో నిర్మించిన రెండు సిమెంటు రోడ్లు, కాలువలు, నగర పరిధిలో మరికొన్ని సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువలను వీరు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమైన పంచాయతీల్లోను అభివృద్ధి పనులను పెద్ద ఎత్తున చేపట్టి పల్లె ప్రాంతాల్లో సైతం నగర వాతావరణం వుండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో ఈ ప్రాంతాల్లో తాము పర్యటించినపుడు ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను ప్రస్తుతం పరిష్కరించడం జరిగిందని, మరికొన్ని సమస్యలను త్వరితంగా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, డిప్యుటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, ఎంఇ వెంకటరామిరెడ్డి, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ త్యాగరాజన్, నగర తెలుగుదేశం అధ్యక్షులు నరేష్, కార్యదర్శి పచ్చయప్ప, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, క్లస్టర్, డివిజన్ ఇన్‌ఛార్జీలు, కమిటీల సభ్యులు, కూటమి పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పదోతరగతి విద్యార్థులు సామాగ్రిని సద్వినియోగం చేసుకోవాలి

వెదురుపుప్పం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :

పదవ తరగతి విద్యార్థులు దాతలు అంజేస్తున్న సామాగ్రిని సద్వినియోగం చేసుకుని పరీక్షలు బాగా రాసి మంచి ఫలితాలు సాధించాలని తహశీల్దార్ బాబు పేర్కొన్నారు. మండలంలోని తొమ్మిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు అశోక్ రెడ్డి అధ్యక్షతన సామాగ్రి అందించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులను ప్రోత్సహించడంకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు కావలసిన ప్యాడ్, పెన్సు, పెన్సిల్స్, లాంగ్ స్కేల్ ఇతర సమాగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు జగదీష్ నాయుడు, అసెంబ్లీ నియోజకవర్గ నిచార్జీ రాజేంద్రన్, జిల్లా ఓటిసి అధ్యక్షులు కైలాసం, నాయకులు గుణశేఖర్ రెడ్డి, విజయ్ భాస్కర్ రెడ్డి, గోపి, పొతగుంటి సిద్దయ్య, రామకృష్ణా రెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, మురళి, ప్రధానోపాధ్యాయులు, ఎంపిడివో పురుషోత్తంలు పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి : సిఐ

కుప్పం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త

విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కుప్పం రూరల్ సిఐ మల్లేష్ యాదవ్ సూచించారు. శుక్రవారం కుప్పం ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌లో విద్యార్థులకు ధైర్య,స్పర్శ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకోవాలన్నారు. ఉన్నత లక్ష్యాల దిశగా అడుగులు వేయాలన్నారు. విద్యార్థి దశలో మత్తుకు, మద్యానికి అలవాటు పడడం మానుకోవాలని సూచించారు. అలాగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏకలనత్తం అటవీ ప్రాంతంలో ఏనుగుల గుంపు

కుప్పం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త

కుప్పం మండల సరిహద్దుల్లో తమిళనాడులోని ఏకలనత్తం అటవీ ప్రాంతంలో ఐదు ఏనుగుల గుంపు తిష్ట వేసింది. ఈ ఏనుగుల గుంపు గురువారం రాత్రి కుప్పం మండల అటవీ ప్రాంతంలో వచ్చేందుకు ప్రయత్నించగా అప్రమత్తమైన అటవీ అధికారులు, సిబ్బంది ఏనుగుల గుంపును ఏకలనత్తం అటవీ ప్రాంతం వైపు పంపారు. మరో పక్క మండలంలోని బేటరాయస్వామి కొండ అటవీ ప్రాంతంలోకి ఏకలనత్తం నుంచి ఏనుగులు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో అటవీ అధికారులు ఆ ప్రాంతంలో సైతం నిఘా ఉంచారు. అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలు రాత్రిపూట బయటకు రావద్దని రైతులు పొలాల వద్దకు వెళ్లరాదని సూచిస్తున్నారు. అలాగే గుడుపల్లె మండలం ఒఎన్ కొత్తూరు సమీపంలోని చిగురుమానిపల్లి వద్ద ఓ ఏనుగు, రామకుప్పం మండలం బళ్ల వద్ద ఓ ఏనుగు సంచరిస్తున్నట్లు అటవీ అధికారులు తెలిపారు.

అంబులెన్స్‌లు రావాలన్నా కష్టం సారూ !!

కుప్పం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త

ప్రముఖ బ్యాంకులు, ప్రముఖ హాస్పిటళ్లు.. మెడికల్ షాపులు.. ఇంకేం ఆ వీధంతా నిత్యం రద్దీగానే ఉంటుంది. అయితే ఇక్కడొచ్చిన తంటా ఏ ంటంటే ప్రజలు ఇష్టారాజ్యంగా వాహనాలను రోడ్ల పక్కన ఆపేసి వెళ్లడం షరామామూలుగా మారింది. ఒక్కో సమయంలో అత్యవసర వేళల్లో ఆంబులెన్స్‌లు రావాలన్నా ఆ మార్గంలో ఇబ్బందులు తప్పడం లేదు. కుప్పం పట్టణంలోని ఎపి వజ్రవేలుశెట్టి వీధిలో నిత్యం ఉండే పరిస్థితి ఇది. సంబంధిత అధికారులు స్పందించి ఈ వీధిలో వాహనాలను ఒక పక్కన నిలుపుదల చేసేలా చర్యలు తీసుకుంటే వాహనాలు, ప్రజల రాకపోకలకు ఇబ్బంది తప్పుతుంది.

23న ఉచిత కంటి వైద్య శిబిరం

చిత్తూరుహెల్త్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:

చిత్తూరు ప్రశాంత్‌నగర్ ఇందిరమ్మ కాలనీలోని అబ్బాజీసస్ మినిస్ట్రీస్‌లో ఈ నెల 23వ తేదీ ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్రిస్టియన్ మైనార్టీ సెల్ నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు చెన్నై ఎంఎన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది ఈ ఉచిత కంటి పరీక్షా శిబిరంకు హాజరై రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఆపరేషన్లకు అవసరమైన వారిని గుర్తించి వారికి ఆపరేషన్లు చేస్తామని, అలాగే చికిత్స కోసం వచ్చిన వారికి పరీక్షలు నిర్వహించిన అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. ఆపరేషన్లకు ఎంపికైన వారికి భోజనం, రవాణా ఖర్చులు, వసతి సౌకర్యం ఉచితంగా కల్పించడం జరుగుతుందన్నారు.

వైభవంగా మహాకుంభాభిషేకం

పలమనేరు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:

పలమనేరులో వెలసిన భూనీలా కల్యాణ వెంకటరమణస్వామి ఆలయంలో శుక్రవారం మహాకుంభాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఆలయ జీర్ణోద్ధారణ, గోపురం పునర్నిర్మాణ పనులు పూర్తి కావడంతో ఈ నెల 18 నుండి 20 వరకు ఉత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా 18న అంకురార్పణ, పంచగవ్య ప్రాసనం, రక్షా బంధనం, కుంభారాధనం, ఉత్తమ హోమం కార్యక్రమాలు జరిగాయి. అలాగే 19న స్వస్థి పుణ్యహవాచనం, ఆలయ వాస్తు బింబం, నవ కలశ స్వపనం, అధివాస హోమం, మహాశాంతి కుంభాభిషేకం, మహామంగళహారతి నిర్వహించారు. ఇక 20న కుంభారాధనం, పంచాగ్ని మహా పూర్ణాహుతి, రాజగోపురం, విమానగోపురంలకు మహా కుంభాభిషేకం, మహానివేదం, తీర్థ ప్రసాద వినియోగం చేశారు. దేవ స్థానం కమిటీ ఆర్యవైశ్య మండలి, అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఆగమ శాస్త్ర ప్రకారం కీలపట్ల కోనేటిరాయ స్వామి దేవస్థానం ప్రదాన అర్చకులు ఖాద్రి నరసింహాచార్యులు ఆలయ అర్చకులు అర్చకం రమేష్‌బాబు, అర్చకం పార్థసారది ఈ కార్యక్రమాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. పట్టణ ప్రముఖులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అధికారికంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి

పలమనేరు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:

విజయనగర దేశాధీశుడు ప్రముఖ యోధుడు శ్రీకృష్ణదేవరాయలు జయంతిని ఇక నుండి అధికారికంగా నిర్వహించుకోవచ్చని పలమనేరు బలిజసేవాసంఘం (బాస్) ఓ ప్రకటనలో తెలిపింది. ఈ మేరకు శుక్రవారం బాస్ అధ్యక్షులు రూపేష్ జిల్లేడు అరుణ్‌కుమార్ విలేకర్లకు తెలిపారు. పలమనేరు బాస్ అభ్యర్థిన మేరకు ఈ నెల 18న అసెంబ్లీలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి అధికారికంగా శ్రీకృష్ణదేవరాయల జయంతిని జరుపుకోవాలని విన్నవించారని తెలిపారు. దీనిపై స్పందించిన అసెంబ్లీ స్పీకర్ రఘురామక్రిష్ణమరాజు సానుకూలంగా స్పందించారని తెలిపారు. బాస్ గౌరవ అధ్యక్షుడు, డిసిసి మాజీ అధ్యక్షుడు సుధాకర్, నాయకులు దైవ ప్రసాద్, కోటేశ్వర్లు, శ్రీధర్, చెంచురెడ్డి, డా.జానార్దన్, మునిరాజా, హేమంత్, నరేష్, గణేష్, ఆర్టీసీ సుబ్రమణ్యం, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఛలో విజయవాడ విజయవంతంకు ఎస్టీయు పిలుపు

చిత్తూరు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఇచ్చిన 'ఛలో విజయవాడ' కార్యక్రమంను విజయవంతం చేయాలని ఎస్టీయు నాయకులు పిలుపునిచ్చారు. చిత్తూరు ఎస్టీయు కార్యాలయంలో శుక్రవారం ఎస్టీయు నాయకులు రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఛలో విజయవాడ కార్యక్రమంపై రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్టీయు నాయకులు మాట్లాడుతూ గత ఎన్నికల్లో ప్రభుత్వం అమలు చేస్తామని చెప్పిన హామీలను అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర యూనియన్ ఇచ్చిన దశల వారీ పోరాటం మేరకు జనవరి 30వ తేదీన మండల కేంద్రాల్లో తహసిల్దార్లకు వినతిపత్రాలు ఇచ్చామని, రెండవ దశలో చిత్తూరు గాంధీ విగ్రహం ఎదుట ఉపాధ్యాయులతో ధర్నా నిర్వహించామన్నారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నుండి ఎలాంటి నిర్దిష్టహామీ లభించకపోడంతో ఫిబ్రవరి 26న ఛలో విజయవాడ కార్యక్రమం చేపట్టి విజయవాడ అలంకార్ సెంటర్‌లో ధర్నా నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా వున్న ఉపాధ్యాయులు తరలిరానున్నారన్నారు. 11వ పిఆర్‌సి గడువు పూర్తయి 30 నెలలు పూర్తయినా 12వ పిఆర్‌సి కమిటీని నియమించకపోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో తీవ్ర ఆందోళన నెలకొందన్నారు. సత్వరం 12వ పిఆర్‌సిని ఏర్పాటు చేసి దానికి ఛైర్మన్‌ను నియమించాలని, 30 తగ్గకుండా మధ్యంతర భృతి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీయు నాయకులు గంటామోహన్, జిల్లా అధ్యక్షులు మదన్‌మోహన్‌రెడ్డి, ఎస్టీయు డివిజన్ కన్వీనర్లు ఢిల్లీ ప్రకాష్, ప్రహసిత్, మహిళా కన్వీనర్ రాధాకుమారి, నాయకులు చంద్రన్, లక్ష్మీపతి, సుబ్రమణ్యం, పిళ్ళై, గుణశేఖరన్, జగదీశ్వర్, మధుబాబు, కిషోర్‌కుమార్‌రెడ్డి, ప్రకాష్, కోదండయ్య తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కోడూరు డివిజన్

సిబ్బందిని అభినందించిన డిఎస్పీ

చిట్వేలి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:

మహాశివరాత్రి సందర్భంగా చిట్వేలి, ఓబులవారిపల్లి మండలాల పరిధిలోని శ్రీ గుండాలకోనలో సమర్థవంతంగా విధులు నిర్వహించిన పోలీసు, రెవెన్యూ, ఆరోగ్య, ఫారెస్ట్, సచివాలయ తదితర సిబ్బందిని రేణిగుంట డీఎస్పీ వై. శ్రీనివాసరావు శుక్రవారం రైల్వే కోడూరు పోలీస్ స్టేషన్లోలో అభినందించారు. ప్రశంసా పత్రాలను అందించారు. తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించినప్పుడే ఉద్యోగికి నిజమైన గుర్తింపు ఉంటుందని డీఎస్పీ అన్నారు. రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు, ఎస్సై వినోద్ కుమార్, ఏఎస్ఐ వెంగయ్యలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఫైడే డ్రై డే కార్యక్రమం

పుల్లంపేట, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :

మండల కేంద్రమైన పుల్లంపేట ను ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమంలో భాగంగా ప్రజలు అవగాహన కలిగి ఉండాలని స్థానిక సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ప్రజలు ఇంటి చుట్టుపక్కల పరిశుభ్రతను కాపాడాలని ఇది వ్యాధులు నివారణకు ఎంతో ఉపయోగపడుతుందని పుల్లంపేట ప్రజల సహకారంతో గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుదాం అని ఆయన తెలిపారు అందుగ్గాను గ్రామంలోని అన్ని వీధుల్లో పంచాయతీ వాహనము ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించమన్నారు గ్రామ ప్రజలు సహకరించాలని సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి కోరారు.

కె కె వడ్డిపల్లిలో వైద్య శిబిరం

చిట్వేలి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:

చిట్వేలి మండల పరిధిలోని కేకే వడ్డేపల్లి గ్రామం నందు శుక్రవారం పిహెచ్సి వైద్యురాలు డాక్టర్ సల్మా ఆదేశాల మేరకు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు హెల్త్ సూపర్వైజర్ ఇస్మాయిల్ భాష తెలిపారు. తాను మాట్లాడుతూ షుగరు, బిపి వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి మంచినీటి నిలువచేసే తొట్టెలు, ట్యాంకులను పరిశీలించి లార్వా వృద్ధి చెందకుండా తగిన జాగ్రత్తలు సూచించామన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని పరిశుభ్రతతోనే పలు వ్యాధులకు దూరంగా ఉండవచ్చని గ్రామ ప్రజలకు తమ సిబ్బంది ద్వారా తెలియపరిచామన్నారు. ఎలాంటి ఆరోగ్య సమస్య ఉన్న గ్రామ ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని ప్రజలను కోరమన్నారు. కార్యక్రమంలో హెచ్ ఈ ఓ ధనలక్ష్మి, ఎమ్ ఎల్ హెచ్ పి శిరీష, ఏఎన్ఎం ఉమామహేశ్వరి, ఆశ లక్ష్మమ్మ పాల్గొన్నారు.

శివరాత్రి సేవలకు... సన్మానం, ప్రశంస పత్రం : డిఎస్పీ

రైల్వేకోడూరు,

ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :

ఇటీవల మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఓబులవారిపల్లి మండలం, చిట్వేలు మండలంలోని శ్రీ గుండాలేశ్వర, కపిలేశ్వర స్వాముల వద్ద పలువురు ప్రభుత్వ శాఖకు సంబంధించిన ఉద్యోగులు చక్కటి సేవలను అందించిన సందర్భంలో దాదాపు 30 మంది పైగా విశిష్ట సేవలను గుర్తిస్తూ వారికి ప్రత్యేక సన్మానం, ప్రశంస పత్రాన్ని అందజేస్తున్నట్లు రేణిగుంట డిఎస్పి శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా కోడూరు మండలంలోని ఎర్రచందనం పార్కు నందు శుక్రవారం ప్రత్యేక సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మరియు రాజంపేట జిల్లా డిఎఫ్ఓ ఆదేశాల మేరకు జాగ్రత్తలు పాటిస్తూ మహాశివరాత్రి నందు స్వామివారి కోనలోకి వెళ్లి తగిన జాగ్రత్తలు తీసుకొని పూజా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అన్నదాత పడిదాం రామచంద్రయ్య మరియు వై కోట సర్పంచ్ ఈశ్వరయ్య, బాలాజీ, బొక్కసం చలపతి, అరవింద్, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ ఎస్ మల్లికార్జున రాజు, అటవీశాఖ అధికారులు, ఏపీఎండిసికి చెందిన సిఎస్ఆర్ సగినాల సుబ్రమణ్యం, వెంకట కిషోర్, శ్రీహరి, అరవింద రెడ్డి, భాను ప్రకాష్ తో పాటు పోలీసులకు,ఆరోగ్య సిబ్బందికి సన్మానాన్ని నిర్వహించారు.

రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి :: సీఐ చంద్రశేఖర్

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :

సమాజంలోని ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని రైల్వే కోడూరు పట్టణ సీఐ సి చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని శ్రీ సాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ముత్యాల పెంచలయ్య ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. మాట్లాడుతూ సమాజంలో ఎంతోమందికి రక్తం అవసరం ఉన్న సందర్భాల్లో ఎన్నో ఉన్నాయని అయితే దాతలు ఇచ్చేందుకు కొంతమంది నిరాకరిస్తున్నారని అలా కాకుండా రక్తదాతలుగా కావాలని ఆయన డిగ్రీ కళాశాల విద్యార్థులకు పిలుపునిచ్చారు. ముత్యాల పెంచలయ్య మాట్లాడుతూ రక్తదానం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ రక్తదానం ద్వారా అనేకమందికి ప్రాణాలు రక్షించ వచ్చని యువత ఇలాంటి సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. అనంతరం రక్తదాతలను ప్రశంస పత్రంతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 80 మంది విద్యార్థులు రక్తదనాన్ని నిర్వహించారని కళాశాల అధ్యాపకులు ఆదపాలా శివకుమార్, వసంత కుమార్‌లు పాల్గొన్నారు.

మంచి నీటి సరఫరాలో అంతరాయం

చిట్వేలి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:

చిట్వేలి గ్రామంలో శింగనమల వీధి నందు జరుగుతున్న అండర్ డ్రైనేజీ పనుల్లో పైప్ లైన్ పగిలి పోవడంతో, మరమ్మత్తుల నిమిత్తం శనివారం ఉదయం 5 గంటల నుండి 10 గంటల వరకు మాత్రమే మంచి నీటి సరఫరా ఉంటుందని ఉప సర్పంచ్ ఉమామహేశ్వర్ రెడ్డి తెలియపరిచారు. తదుపరి సాయంత్రం 6 గంటల నుంచి నీటి సరఫరా కొనసాగిస్తామని తెలిపారు. ఇబ్బందిని గమనించి గ్రామ ప్రజలు సహకరించాలని ఉమామహేశ్వర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

రూ.35.35లక్షల సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

చిత్తూరురూరల్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:

చిత్తూరు నియోజకవర్గంకు సంబంధించి 24మంది లబ్దిదారులకు రూ.35.35లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ శుక్రవారం పంపిణీ చేసారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేద ప్రజల వైద్యసేవలకు ఆర్థిక భరోసాగా సిఎం సహాయనిధి ద్వారా ఆదుకుంటున్నారనీ, ఇప్పటివరకు 201మందికి రూ.2.23కోట్లు సాయం అందించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, జిజెఎం చారిటబుల్ ఫౌండేషన్ డైరెక్టరు గురజాల చెన్నకేశవులనాయుడు, గుడిపాల ఎంపిపి గోళ్లహరిప్రసాద్‌చౌదరి, స్థానిక తెదేపా నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కుప్పం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త

పలమనేరు 220కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 10ఎంవిఎ అదనపు ట్రాన్స్‌ఫార్మర్ పనులు చేపడుతుం డడంతో శనివారం కుప్పం నియోజకవర్గంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రెస్కో ఛైర్మన్ ప్రతాప్‌కుమార్, ఎండి సోమశేఖర్ తెలిపారు. ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం 1 గంట దాకా విద్యుత్ సరఫరాకు వ్యవసాయ సప్లైతో సహా అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

సంజీవని ప్రాజెక్టును సద్వినియోగం చేసుకోవాలి

కుప్పం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త

సిఎం చం ద్రబాబునాయుడు కుప్పంలో చేపట్టిన సంజీవని ప్రాజెక్టును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్ కోరారు. శుక్రవారం తెదేపా కార్యాలయంలో మండల కార్యాలయంలో సంజీవని ప్రాజెక్టు (డిఐఎన్‌సి) గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ ప్రాజెక్టులో ఒకసారి రోగి పేరు నమోదు చేసుకుంటే వారి ఆరోగ్య వివరాలు డిజిటల్ రూపంలో భద్రపరచడంతో పాటు అత్యవసర వేళల్లో ప్రముఖ వైద్యులచే చికిత్సలు అ ందించేలా సిఎం చంద్రబాబు చర్యలు చేపట్టారన్నారు. ప్రజలు సంజీవని సేవలు పొందేందుకు 155337టోల్‌ఫ్రీ నెంబరుకు సైత ం కాల్ చేయవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి పిసి సాంబశివం, కనీసవేతనాల బోర్డుసభ్యుడు శరవణ, కార్పోరేషన్ డైరెక్టర్ చెక్కునత్తం మణి, కాణిపాకం డైరెక్టర్ వసంతమ్మ, నేతలు శ్రీనివాసులు, హైదర్‌వలీ, కనకరాజు, విభూషణ్, పిఎసిఎస్‌ఛైర్మన్ కృష్ణమూర్తి, మహే ంద్ర తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంకై ఎం.పి.కి వినతి

కుప్పం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త

వివిధ సమస్యల పరిషా ్కరం కోరుతూ చిత్తూరు ఎం.పి.దగ్గుమళ్ల ప్రసాద్‌రావుకు వినతిపత్రం అందించినట్లు జిల్లా ఎంఆర్‌పిఎస్ మాజీ అధ్యక్షుడు ప్రకాష్ తెలిపారు. మల్లానూరులో పుష్‌పుల్ రైలు స్టాపింగ్‌తో పాటు మల్లానూరులో అంబేద్కర్ భవన్ నిర్మాణంకు, దళితుల స్మశాన వాటిక అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరినట్లు చెప్పారు.జిల్లాలో దళితుల సమగ్రాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల ద్వారా సహకారం అందించాలని కోరగా ఎంపి సానుకూలంగా స్పందించి తగు చర్యల నిమిత్తం హామీ ఇచ్చారని తెలిపారు.

కూర్మాయిపురంలో మురుగు కాల్వలకు మోక్షం

కుప్పం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త

స్థానిక కొత్తపేట కూర్మాయిపురంలో చెత్తచెదారాలతో నిండిన కాలువలకు మోక్షం లభించింది. క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్ కూర్మాయిపురం ప్రాంతంలో కాలువల సమస్యలను కమీషనర్ శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. కమీషనర్ ఆదేశాలతో మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది కూర్మాయిపురంలో ఉన్న కాలువల్లో పేరుకుపోయిన చెత్తచెదారాలు తొలగించారు. దీంతో మురుగునీరు తొలగి నీరు కాలువ వెంబడి ప్రవహిస్తోంది. దీంతో క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్ ప్రజల తరపున కమీషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి

శాంతిపురం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త

విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధన దిశగా అడుగులు వేయాలని టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ సూచించారు. శుక్రవారం పిఎంశ్రీ ఎపి మోడల్ స్కూల్ వార్షికోత్సవంకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌లు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్నార న్నారు. నాణ్యమైన విద్య అందేలా చర్యలు చేపట్టారన్నారు. అ కార్యక్రమంలో నేతలు రాజే ం ద్ర, నాగరాజు, మణి, గిరి, సింగిరి శ్రీనివాసులు, చలపతి, బాలాజీ, శివ, మంజు, భాస్కర్, కార్తీక్, ఎస్ఎంసి ఛైర్మన్ రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు రాత అట్టలు పంపిణీ

శాంతిపురం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త

మండలంలోని కడపల్లి హైస్కూల్, ఎపి మోడల్ స్కూల్‌లో టెన్త్ పరీక్షలు రాయనున్న 164మంది విద్యార్థులకు శాంతిపురం లయన్స్‌క్లబ్ అధ్వర్యంలో రాత అట్టలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఉదయ

తిరుపతి డివిజన్

పబ్లిక్ ప్రాసీక్యూటర్‌గా కమలాకర్

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి కోర్టులో పబ్లిక్ ప్రాసీక్యూటర్‌గా మండలంలోని బసవయ్యపాళెంకు చెందిన కమలాకర్‌ను నియమిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారి చేసింది. యువకుడైన కమలాకర్ న్యాయవాద వృత్తిలోనే కాకుండా సామాజిక కార్యక్రమాల్లో కూడా చురుగ్గా పాల్గొంటున్నారు.ఈ నేపథ్యంలో ఇటీవల హైకోర్టు పబ్లిక్ ప్రాసీక్యూటర్లను నియమించారు. శ్రీకాళహస్తిలోని కోర్టులకు పబ్లిక్ ప్రాసీక్యూటర్‌గా కమలాకర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారి చేసింది. ఆయన నియామకానికి పలువురు న్యాయవాదులు అభినందించారు.

ఆశా నాట్యమండలి సాంస్కృతిక అద్భుతం

శ్రీకాళహస్తిరూరల్,ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయం సారథ్యంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ధూర్జటి కళావేదికపై ఆశా నాట్యకళా నిలయంకు చెందిన చిన్నారి కళాకారుల నృత్యప్రదర్శనలు అకట్టుకున్నాయి. పట్టణ నడిబొడ్డులోని శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన చిన్నారుల నాట్య ప్రదర్శనలకు సభికుల నుంచి విశేష స్పందన వచ్చింది.కళాకారులు ఎంఆర్ ప్రభాకర్, దేవి దంపతుల కుమార్తె ఎం.మౌనిష పౌర్ణమి చిత్రంలోని శివతాండవం నృత్యాన్ని చక్కగా ప్రదర్శించారు. విశేష ప్రదర్శనతోఆకట్టుకున్న కళాకారిణిని ఆలయం తరపున బోర్డు సభ్యులు దండి రాఘవయ్య సత్కరించారు.

ప్రజల సమస్యలు తీర్చడమే ప్రభుత్వ లక్ష్యం: గంజి మాధవయ్య

పుత్తూరు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరక్టర్ గంజి మాధవయ్య అన్నారు. పుత్తూరు రూరల్ మండలం తడుకు పంచాయతీ పరిధిలోని మజ్జిగ గుంట ఎస్టీ కాలనీ వాసులు శుక్రవారం మాధవయ్యను కలిసి పెన్షన్లు, తాగు నీటి చేతి పంపు, ఇళ్ల స్థలాలు వంటి పలు సమస్యలకు సంబంధించి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ చొరవతో రూరల్ మండలం పరిధిలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమాన్ని ఏకకాలంలో ప్రభుత్వం సమర్థంగా అమలు చేస్తోందన్నారు. మజ్జిగగుంట ఎస్టీ కాలనీ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరక్టర్ అమరావతి, టిడిపి నాయకుడు చిరంజీవి తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

వైసిపి దామరపాకం అధ్యక్షుడిగా హరిరెడ్డి

పుత్తూరు (నగరి), ఫిబ్రవరి 20 ప్రభాతవార్త : మాజీ మంత్రి ఆర్.కె.రోజా ఆదేశాల మేరకు నగరి మండలంలోని దామరపాకం పంచాయతీ వైసిపి నూతన అధ్యక్షుడిగా హరి రెడ్డిని నియమించారు. శుక్రవారం పంచాయతీలో వైసిపి బలోపేతానికి సంబంధించి ముఖ్య సమావేశం జరిగింది. స్థానిక పార్టీ సీనియర్ నాయకులు, పార్టీ అధ్యక్షుల సమక్షంలో పంచాయతీ కమిటీతో పాటు పంచాయతీ అనుబంధ కమిటీలను గుర్తించి, క్యాడర్ రిజిస్ట్రేషన్ పోర్టల్ ద్వారా సభ్యులందరినీ ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అనంతరం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన హరిరెడ్డికి నాయకులు శుభాకాంక్షలు చెబుతూ...పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. అధిష్ఠానం సూచన మేరకు గ్రామ స్థాయిలో ప్రతి కార్యకర్తను సంఘటితం చేసి పార్టీని బలోపేతం చేస్తామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గణపతి శెట్టి, అధ్యక్షుడు తిరుమల్ రెడ్డి, జిల్లా పార్టీ కార్యదర్శి లీలా రామన్, గురుమూర్తి, సోము తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలు

తిరుపతి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, ఆదేశాల మేరకు ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచారి పర్యవేక్షణలో నగరంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించాలనే ఉద్దేశంతో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు..ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన 23 మంది వాహనదారులపై కేసులు నమోదు , ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన 46 మంది పై కేసులు నమోదు చేశారు. మద్యం సేవించి వాహనం నడిపినందుకు ప్రతి ఒక్కరికి పదివేల రూపాయలు జరిమానా విధించబడినది. అలాగే ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన 46 మందికి ఒక్కొక్కరికి 500 రూపాయలు జరిమానా విధించబడినది.

సిమ్యులేషన్ ప్రయోగాత్మక శిక్షణ

యూనివర్సిటీ(తిరుపతి), ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని వుమెన్ బయోటెక్ ఇన్క్యుబేషన్ ఫెసిలిటీ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి ఉన్నత శిక్షా అభియాన్ - బహుముఖ విద్యా పరిశోధనా విశ్వవిద్యాలయం లో శిక్షణ ప్రాయోగిక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు పాఠశాల విద్యార్థుల కోసం విజ్ఞానశాస్త్రం, సాంకేతికత, ఇంజనీరింగ్ ,గణితశాస్త్రం పై ఆధారిత .ఫేస్ 2 శిక్షణ కార్యక్రమం 16 నుండి 20 వరకు ఐదు రోజుల పాటు విజయవంతంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఆచార్య సి. వాణి ,డా. శోభారాణి తుంగా ,విద్యార్థులకు ఏ. అమల గారు ప్రత్యేక శిక్షణ అందించారు.

విద్యార్థినులకు శిక్షణ

యూనివర్సిటీ(తిరుపతి), ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: ఎస్‌పిఎంవివిలో విద్యార్థినులకు నిర్వహిస్తున్నఐదు రోజు లవర్క్‌షాప్‌లో ఫైర్ సేఫ్టీ పై శిక్షణ ఇవ్వడం జరిగింది. తిరుపతి జిల్లా అగ్నిమాపక శాఖ అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ కిరణ్ కుమార్‌రెడ్డి రిసోర్స్ పర్సన్ గాహాజరై పాల్గొన్నారు. కార్యాలయాలు, విద్యాసంస్థలు, వాణిజ్య సముదాయాలలో అగ్ని భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. విద్యుత్ లోపాలు, గ్యాస్ లీకేజీలు, జాగ్రత్తల లోపం వల్ల జరుగుతాయని పేర్కొన్నారు. సిబ్బంది చిరంజీవి, రెడ్డిస్కర్, మహబూబ్ భాష గ్యాస్ సిలిండర్ లీకేజ్ సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫైర్ ఎక్స్టింగ్విషర్ లో పాటించాల్సిన భద్రతా చర్యలను ప్రాక్టికల్ డెమో ద్వారా చూపించారు. మహిళా అధ్యయన విభాగ హెడ్ ఇన్చార్జ్ డాక్టర్ నీరజ, నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ గంగాభవాని, చంద్రిక విద్యార్థులు పాల్గొన్నారు.

సోలార్ సమస్యల పరిష్కారం కోసం 1912

తిరుపతి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: ఎస్పీడీసీఎల్ పరిధిలోని సోలార్ విద్యుత్ వినియోగదారులు సమస్యల పరిష్కారం కోసం టోల్‌ఫ్రీ నంబర్ 1912ను సంప్రదించవచ్చని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి శుక్రవారం పేర్కొన్నారు.సోలార్ విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం వినియోగదారులు కాల్ సెంటర్ కి కాల్ చేయడం ద్వారా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. కాల్ సెంటర్లో సోలార్ సంబంధిత ఫిర్యాదులను కూడా నమోదు చేసే సౌకర్యాన్ని నూతనంగా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. సమస్యను పరిష్కరించిన వెంటనే వినియోగదారునికి ఫీడ్‌బ్యాక్ కాల్ చేయబడుతుందని, వినియోగదారుడు ఇచ్చే ఫీడ్‌బ్యాక్‌కు అనుగుణంగా పిర్యాదును మూసివేయడం/తెరవబడడం జరుగుతుందన్నారు.

కోర్టు కేసులు త్వరగా పరిష్కారం కావాలి
-కమిషనర్ మౌర్య

తిరుపతి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: పట్టణ ప్రణాళిక విభాగంలో ఉన్న కోర్టు కేసులు త్వరగా పరిష్కారం జరిగేలా చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య అధికారులను ఆదేశించారు. కోర్టు కేసుల పరిష్కారం, బి.పి.ఎస్.,ఎల్.ఆర్.ఎస్, దరఖాస్తులపై శుక్రవారం పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ ప్రణాళిక విభాగంలో పెండింగ్ లో ఉన్న కోర్టు కేసులు పరిష్కారం అయ్యేలా తగు చర్యలు చేపట్టాలని తెలిపారు. పిటిషన్ దారులతో, న్యాయవాదులతో చర్చించాలని తెలిపారు. గౌరవ హైకోర్టు ఆదేశాలు త్వరగా అమలు అయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బి.పి.ఎస్., ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో డిసిపీ ఖాన్, ఏసీపీ లు పార్వతి ప్రియ, మూర్తి, సర్వేయర్ కోటేశ్వరరావు, టిఫిబి ఓ లు మధు, వంశి, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట

పులిచెర్ల, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: పులిచెర్ల మండలంలోని మంగళంపేటలో తిరుమల తిరుపతి అనుబంధ ఆలయమైన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట, మహా కుంభాభిషేకం కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వెంకటేశ్వర స్వామికి పట్టు వస్త్రాలు సమర్పిస్తూ తొలి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, పుంగనూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన సతీమణి స్వర్ణమ్మ, రాజంపేట పార్లమెంటు సభ్యులు పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి విచ్చేసి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆగమ శాస్త్ర నియమాల ప్రకారం ఆగమ పండితులు చేదుండి శ్రీనివాస దీక్షితులు బృందం, ఆలయ ప్రధాన అర్చకులు శేషాచార్యులు బృందం ఆధ్వర్యంలో జరిగిన తొలి పూజలో వారు పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ట అనంతరం స్వామివారి ఆశీస్సులు తీసుకున్న అతిథులకు ఆలయ ప్రతినిధులు శ్రీ వెంకటేశ్వర స్వామి చిత్రపటాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎంపీ మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు అందరి కుటుంబాలపై ఉండాలని, ప్రజలకు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సురేంద్ర రెడ్డి,రెడ్డిఈశ్వర్ రెడ్డీ, జయచంద్రరెడ్డి, రాయల్ మోహన్, నాగరాజ ప్రసాద్, రమణ రెడ్డి, అశోక్ రెడ్డి, వాసుదేవారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, లక్ష్మిపతి రాజు, మునస్వామి, తిరుమలేష్, మునిరత్నం, సుబ్రహ్మణ్యం, గోవిందరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, ఆలయ అర్చకులు కుమార్ స్వామి, గోవింద్ స్వామి, టీటీడీ అర్చకులు పాల్గొన్నారు.

అంకాలమ్మ మహా కుంభాభిషేక మహోత్సవం

సత్యవేడు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: మండలంలోని మదనంబేడు గ్రామంలో పునర్నిర్మించిన శ్రీ అంకాళ పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు మహా కుంభాభిషేక మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి గ్రామ పెద్దలు ఇప్పటికే అన్ని ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగింది. ఇందులో భాగంగా తాత్కాలిక యాగశాల నిర్మాణం, అర్చి పనులు పూర్తయ్యాయి. గతంలో శ్రీ అంకాళపరమేశ్వరి ఆలయం మరమ్మతులకు గురికావడంతో దీనిపై గ్రామ పెద్దలు దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో ఆలయాన్ని పూర్తి స్థాయిలో ఆధునీకరించి పునర్నిర్మించడానికి నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఈ క్రమంలో రెండేళ్ళ క్రితమే పలు ప్రాంతాల నుంచి దాతల నుంచి విరాళాలను సేకరించి పునర్నిర్మాణ పనులను ప్రారంభించారు. మూల వీరాట్ అంకాళమ్మ అమ్మవారి విగ్రహాన్ని యథా స్థానంగా ఉంచి మిగతా ఉప విగ్రహాలను కొత్తగా తయారు చేయించారు. శ్రీ అంకాళమ్మ పరమేశ్వరి ఆలయాన్ని పునర్నిర్మించడానికి, మహా కుంభాభిషేక వేడుకలకు దాదాపు ఒక కోటి రూపాయలు ఖర్చు అయినట్టు నిర్వాహకులు పేర్కొన్నారు. ఆలయంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు కుంభాభిషేక వేడుకలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఫిబ్రవరి 21 శనివారం ఉదయం పుణ్యవచనం, గోపూజ, గంగాగరికి, నాగాలమ్మ ఆహ్వానం తరువాత అమ్మవారి విగ్రహ శిలలు గ్రామ ప్రదర్శన జరగనుంది. భక్తులందరూ మహా కుంభాభిషేక వేడుకల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరుతున్నారు.

శివరాత్రి ఉత్సవాల్లో సమయపాలనతో పాటు... పారిశుద్ధ్యం భేష్

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఉత్సవాల నిర్వహణకు సంబంధించి ఆలయ అధికారుల సమయపాలన, మున్సిపాలిటి సహకారం భేష్‌గా సాగింది. 10 రోజులుగా శివరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో నాలుగురోజులుగా ప్రధాన ఉత్సవాలు జరుగుతున్నాయి. అయితే ఈ ఉత్సవాల్లో దేవస్థానం సహాయకుల్లో మొదటి జాబితాలో మున్సిపాలిటి ఉంది. ముఖ్యంగా నాలుగు మాడావీధులు, సన్నిధి వీధికి సంబంధించి మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్, రేయింబవళ్ళు ప్రత్యేక శ్రద్ధ వహించారు. ఆయన సూచనలతో శానిటరీ ఇన్స్పెక్టర్ మోతీలాల్ వారి సిబ్బంది రేయింబవళ్ళు రోడ్డు మీద ఒక్క చెత్తముక్క కూడా లేకుండా శుభ్రం చేసారు. శివభక్తులు ఒక్క రోజు జాగరణ చేస్తే కమిషనర్ బ్రహ్మోత్సవాలు ప్రారంభమైనప్పటి నుంచి ప్రతి రోజూ జాగరణే. వారి సిబ్బందికి శివరాత్రి చూపించారు. పుత్తూరు, వెంకటగిరి, నాయుడుపేట, సూళూరుపేట మున్సిపాలిటిల నుంచి ఒక్కొక్క మున్సిపాలిటి నుంచి 15 మంది కార్మికులను డెప్యూట్ చేసారు. వారు నిత్యం ఉత్సవాల సందర్భంగా పారిశుద్ధ్యంను నిర్వహించారు.

నిషేదంపై అవగాహన కలిగివుండాలి

నిండ్ర,ఫిబ్రవరి 20 ప్రభాతవార్త : ర్యాగింగ్ పూర్తిగా కాలేజీలలో నిషేదించినట్లు నగరి రూరల్ సిఐ భాస్కర్ తెలిపారు.శుక్రవారం మండల కేంద్రంలోని జూనియర్ కాలేజీలో ర్యాగింగ్ పూర్తిగా నిషేదం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిషత్తును తీవ్రంగా ప్రభావితం చేసే ర్యాగింగ్‌కు కళాశాలల్లో ఎలాంటి స్థానం లేదని స్పష్టం చేసారు. అలాగే విద్యార్థులు సైబర్ నేరాలు,పోక్స్ చట్టం,గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అంశాలపై సమగ్ర అవగాహన కలిగి సూచించారు.రోడ్డు భద్రతలో భాగంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

అప్రూల్ లేని లేఅవుట్‌ల రిజిస్ట్రేషన్లు!

కార్వేటినగరం,ఫిబ్రవరి 20 ప్రభాతవవార్త: కోట దళితవాడ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన లే-అవుట్ అప్రూల్ చేయకనే యథేచ్ఛగా విక్రయించి రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు సమాచారం. ఎ3.52సెంట్ల స్థలంలో 160ప్లాట్లు ఏర్పాటు చేసినట్లు తెలుస్తుంది. అప్రూల్ చేయకపోవడంతో కొనుగోలుదారులకు పార్కు, ఆలయం, డ్రైనేజి, విద్యుత్‌లైట్లు, విశాలమైన రోడ్లు అన్ని కోల్పోతున్నట్లేనని పలువురు అంటున్నారు. అలాగే పంచాయతికి పదిశాతం స్థలం కూడా కేటాయింపు జరగదని అంటున్నారు. ఈ విషయంపై పంచాయతీ, జిల్లా అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారో తెలియాల్సి వుంది. కొనుగోలుదారులకు న్యాయం జరిగేలా,ప్రభుత్వానికి రాబడి వచ్చేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

కేవీబీ పురం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: రాష్ట్రీయ సేవా సమితి(రాస్) మహిళా పొదుపు సంఘాల సభ్యుల సౌకర్యార్థం రాస్ ప్రధాన కార్యదర్శి శ్రీ వెంకటరత్నం, డైరెక్టర్ నాగరాజు ఆదేశాల మేరకు కేవీబీ పురం మండలం ఓలూరు గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. తిరుపతి డీఎన్ఆర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించి సమస్యలు ఉన్న వారికి జనరల్, ఆర్థో, గైనకాలజిస్ట్ డాక్టర్లు వారికి సంబంధించిన సమస్యల మీద అవగాహన కల్పించడం జరిగింది. అందరికి ఓపీగా చూసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా పొదుపు సంఘాల ప్రాజెక్టు ఆఫీసర్ కరుణాకర్‌నాయుడు మాట్లాడుతూ సంఘ సభ్యులు కేవలం పొదుపు అప్పులే కాకుండా వారి ఆరోగ్యం, అభివృద్ధి కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వైద్య శిబిరంలో పొదుపు సంఘాలు, రాస్ అధికారులు, రోగులు పాల్గొన్నారు.

23నుంచి ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం

సత్యవేడు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ఫిబ్రవరి 23 నుంచి ప్రారంభం అవుతుందని సత్యవేడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఫిబ్రవరి 23 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ పరీక్షలు కొనసాగుతుందన్నారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. ఇందులో భాగంగా పరీక్షలు రాయడానికి 12 గదులను కేటాయించినట్లు పేర్కొన్నారు. దీంతో పాటు సీసీ కెమెరాలు కూడా ఏర్పాటుచేశామన్నారు. ప్రతి గదిలోను సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. దీంతో పాటు విద్యార్థులకు అవసరమైన బల్లలు ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. తొలి రోజు తెలుగు పరీక్షతో ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతుందని, కాగా సత్యవేడు ప్రభుత్వ జూనియర్ కళావాల కేంద్రంగా జరిగే ఇంటర్ పరీక్షలకు ప్రధాన అధికారిగా వెంకటరామిరెడ్డి, డిపార్ట్‌మెంట్ పరీక్షల అధికారిగా మధుసూదన్ వ్యవహరించనున్నారు.

ఆర్టీసీ డ్రైవర్ ఆకస్మిక మృతి!

సత్యవేడు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: సత్యవేడు ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న డ్రైవర్ రవి శుక్రవారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. బంధువులు వివరాల మేరకు.. శుక్రవారం డ్రైవర్ రవి ఆకస్మాత్తుగా సత్యవేడులో ఎన్‌టీఆర్ నగర్‌లోని ఆయన ఉంటున్న ఇంటిలో మరణించాడు. శనివారం ఉదయం 10 గంటలకు ఆయన స్వగ్రామం పీవీ పురంలో దహన క్రియలు జరుగుతుందని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. రవి మృతి పట్ల డిపో మేనేజర్ కోట బాబు, ప్రభాకర్, నాగరాజు, సురేష్, గోవింద్, ఆనంద్, పవన్ తదితరులు సంతాపం తెలియజేశారు.

గ్రామ కమిటీల ఏర్పాటుపై సమీక్ష సమావేశం

విజయపురం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: మాజీ మంత్రి రోజా ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని పాతార్కాడు, జంబాడ గ్రామాల్లో వైసీపీ నూతన గ్రామ కమిటీల ఏర్పాటుపై పార్టీ అబ్జర్వర్ దేగ సతీష్ యాదవ్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీల నిర్మాణంతో పాటు పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. కార్యక్రమంలో వైసీపీ స్థానిక నాయకులు సుబ్బుయాదవ్, దేవ, శంకర్, చిన్న పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆశయసాధనే బాష్యం లక్ష్యం

తిరుపతి విద్య, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: తల్లిదండ్రుల ఆశయ సాధనే లక్ష్యంగా విద్యార్థులకు నాణ్యమై విద్యను అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే బాష్యం లక్ష్యమని బాష్యం ఎండీ సాకేత్ రామ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆర్సీ రోడ్డు అవిలాలలోని బాష్యం బ్లూమ్స్ సీబీఎస్ఈ క్యాంప్లో పాఠశాల మొదటి వార్షికోత్సవం జెడ్ ఈ ఓ లక్ష్మణ్ రావు ఆధ్వర్యం లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు పూర్వ విద్యార్థిని డాక్టర్ ఎం పావని ముఖ్య అతిథులు విచ్చేసి మాట్లాడుతూ ఏపీ, తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాలలో బ్లూమ్స్ సీబీఎస్ఈ కరికులం విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు కాన్సెప్ట్ బేస్డ్ లెర్నింగ్, భవిష్యత్తు పరీక్షలపైన ప్రధానంగా దృష్టి సారించి నాణ్యమైన విద్యను అందించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పూజా శరవణన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు,తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

విజయపురం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూలు పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి ప్యాడ్స్ జామెంట్రీ బాక్సులు, పెన్స్ విశ్రాంత ఉపాధ్యాయుడు చంద్రయ్య వితరణగా అందించాడు.

కంటి వైద్య శిబిరం

తిరుపతి విద్య, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: స్థానిక ఎయిర్ బైపాస్ రోడ్డులోని స్టార్ హెల్త్ ఇన్స్యూరెన్స్ కంపెనీలో ఉద్యోగులకు, కస్టమర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వాసన్ ఐ కేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి స్టార్ ఇన్స్యూరెన్స్ అసిస్టెంట్ రీజనల్ హెడ్ పి దామోదరం, వాసన్ ఐ కేర్ నుంచి డాక్టర్ స్రవంతి పాల్గొని మాట్లాడుతూ వాసన్ ఐ కేర్, స్టార్ హెల్త్ ఇన్స్యూరెన్స్ కంపెనీ అనుసంధానంగా ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు వెళ్లుతున్నాయని, ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థల ప్రతినిధులు పెంచల్ బాబు, జగన్, ఆల్తాఫ్, శ్రీనివాసులు, కంపెనీ ఉద్యోగులు, కస్టమర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమస్యల కొరకు టోల్ ఫ్రీ నంబర్

తిరుపతి విద్య, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: ఈనెల 23 వతేదీ సోమవారం నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు హాల్ టికెట్ల విషయంతో పాటు పరీక్షా కేంద్రంలో ఎటువంటి సమస్యలు ఉత్పన్నమైనా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన టోల్ నంబర్కు ఫిర్యాదు చేయాలని ఆర్ఓ జి రాజశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. టోల్ ఫ్రీ నంబర్ 08772237200 అనే నంబర్ కు ఫోన్ చేసి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సమస్యలను తెలిపి పరిష్కరించుకోవాలని సూచించారు.

మహాధర్నా పోస్టర్లు ఆవిష్కరణ

తిరుపతి విద్య, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పీడీఎస్ యు ఆధ్వర్యంలో ఈనెల 27న విజయవాడ ధర్నా చౌక్ లో జరుగనున్న మహా ధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఆ సంఘం నాయకులు ఎస్వీయూ ఎదుట ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీడీఎస్ ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు సునీల్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఈనెల 27 విజయవ

ప్రజల గుండెల్లో నేదురుమల్లి!

వాకాడు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: రాతి పలక మీద పేరు కన్నా ప్రజల గుండెల్లో నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి ఉన్నాడని వైఎస్ఆర్సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త దివంగత మాజీ ముఖ్యమంత్రి తనయుడు రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వాకాడులో నేదురుమల్లి కళాక్షేత్రంలో జనార్దన్‌రెడ్డి 91వ జన్మదినం పురస్కరించుకుని చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలు వేసి ఘన నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. తన తండ్రి ఆశయ సాధనాలకు ఎన్.బి.కె.ఆర్ ఇన్స్టిట్యూట్‌ను యూనివర్సిటీ చేయడమే తన లక్ష్యమన్నారు.అభివృద్ధి ద్వేయంగా పనిచేయడమే తన కర్తవ్యం అని, తన తండ్రి చేయాల్సిన పనులు ఏమైనా ఆగి ఉన్న, తెలుసుకొని ఆ అభివృద్ధి పనులు మీద దృష్టి పెట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఈసీజీ వైసీపీ సభ్యులు కొడవలూరు దామోదర్ రెడ్డి, మాజీ ఎంపీపీ దువ్వూరు మధుసూదన్ రెడ్డి, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ పాపా రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, చిట్టమూరు వైసిపి మండల కన్వీనర్ శ్రీనివాసులు రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు దువ్వూరు విజయభాస్కర్ రెడ్డి, హిమ కుమార్‌రెడ్డి, గూడూరు వెంకటేశ్వర్లు రెడ్డి, సుధాకర్ రెడ్డి, షనీల్ రెడ్డి, సర్పంచ్ సిద్ధారెడ్డి మధుసూదన్‌రెడ్డి, దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, దువ్వూరు రమణారెడ్డి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు అవగాహన ఉండాలి: డీఎస్పీ

నాయుడుపేట, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: ప్రతి వస్తువులు కొనుగోలు చేసే సమయంలో వినియోగ దారులు వాటి నాణ్యత, తయారీ సంస్థ ను పరిశీలిం చాలని నాయుడుపేట డివిజన్ పోలీసు అధికారి చెంచుబాబు తెలిపారు. శుక్రవారం నాయుడుపేట పోలేరమ్మ ఆలయం వద్ద వినియోగదారులు హక్కుల పరిరక్షణా ఫారం అవగాహన సంబందించిన పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు ఏదో ఒక చోట ప్రతి ఒక్కరూ ఏదో విధంగా వస్తువులు కొనుగోలు చేసి మోసపోతున్నారు అని తక్కువ ధరకే వస్తువులు పై ఆశ పడి నాణ్యత లేని వస్తువులు కొనుగోలు చేయవద్దు అని అన్నారు. ముఖ్యంగా మాల్స్‌లో కొనుగోలు చేసే సమయంలో ప్రతి వస్తువులు, బిల్లులను పరిశీలించి కొనుగోలు చేయాలని తెలిపారు. పెట్రోల్ బంకులో కూడా వాహనదారులు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వినియోగదారులు హక్కుల పరిరక్షణా ఫారం ఉపాధ్యక్షులు యన్ ఏవీ కుమార్ డీఎస్పీ చెంచుబాబుకి మెమెంట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నానాబల సుబ్బారావు, ఆకుల కుబేర మణి, రాగి శేషగిరి, మదిరి. చిట్టిబాబు, నైనప్పగారి వేంకటేశ్వర్లు, గురునాథ్నం, కృష్ణా రెడ్డి, ముత్యాలయ్య, చిగురాలకు సురేంద్ర, ప్రసాద్, మురళి, యుగంధర్, సురేష్, జి. సోము తదితరాలు పాల్గొన్నారు.

సూళ్ళూరుపేట డివిజన్

సూళ్లూరుపేట ఎస్ఐ బ్రహ్మనాయుడు బదిలీ

- నూతన ఎస్ఐగా అజయ్‌కుమార్

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: సూళ్లూరుపేట పోలీసుస్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న బ్రహ్మనాయుడు నాయుడుపేటకు బదిలీ అయ్యారు. దొరవారిసత్రం పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్ఐ అజయ్ కుమార్‌ను సూళ్లూరుపేట నూతన ఎస్ఐగా నియమించారు. అలాగే తిరుపతిలో వీఆర్‌లో ఉన్న జీవీ చౌదరిని దొరవారిసత్రం ఎస్ఐగా నియమిస్తూ జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. కొత్తగా నియమితులైన ఎస్ఐలు తమ పోలీసుస్టేషన్లలో త్వరలోనే బాధ్యతలు స్వీకరిస్తారు..

టిడిపి నేత గుండాలకి ఎమ్మెల్యే ఘన నివాళులు

వాకాడు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: మండల పరిధిలోని బాలిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు గుండాల శ్యామ్ సుందర్ రెడ్డి ఆకస్మికంగా మృతి చెందడంతో శుక్రవారం గూడూరు శాసన సభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్ ఆయన భౌతిక దేహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి,ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట మండల పార్టీ అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్ రెడ్డి, సన్నారెడ్డి విజయ శేఖర్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు దువ్వూరు అజిత్ కుమార్ రెడ్డి, మోహన్ నాయుడు, పంట్రంగం అరుణ్ కుమార్, అన్నమేటి చంద్రయ్య, కుంచం దయాకర్, రమణయ్య, తదితరులు ఉన్నారు.

వెల్నెస్ సెంటర్ను తనిఖీ చేసిన ఎంపీడీవో

వాకాడు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: వాకాడు మండలం నెల్లిపూడి పంచాయతీ పరిధిలోని పల్లిపాలెం గ్రామంలో ఉన్న వెల్నెస్ సెంటర్ను ఎంపీడీవో సాయిప్రసాద్ ఆక్స్మికంగా తనిఖీ చేశారు. క్లినిక్‌లోని వివరాలను నర్స్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ పరిధిలోని వస్తుంటి చేనికి ఎంతమంది వస్తున్నారు, ఎవరెవరికి ఏ వైద్యం అందుతుంది పూర్తిస్థాయిలో వివరాలు అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్‌తో పాటు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట టిడిపి నాయకుడు ఎంబేటీ పోలయ్య, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

బెటాలిని అభివృద్ధికి అందరి సహకారం అవసరం

వెంకటగిరి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: 9వ పోలీసు బెటాలియన్ అభివృద్ధికి అందరి సహ కారం అవసరమని కమాండెంట్ సాయి వరప్రసాద్ తెలిపారు. బెటాలయంలో నూతనంగా నిర్మించే రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెటాలి యన్ అభివృద్ధికి వెంకటగిరి ఎమ్మెల్యే రామకృష్ణ, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డిల సహకారం అవసరమన్నారు.ఈ కార్యక్రమంలో బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన ఘనత నేదురుమల్లిదే

వెంకటగిరి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త : దివంగత మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్ రెడ్డి వెంకటగిరి నియోజకవర్గాన్ని ఎంతగానో అభివృద్ధి చేశారని వెంకటగిరి మున్సిపల్ వైస్ చైర్మన్ బాలయ్య తెలిపారు. దివంగత మాజీ సీఎం జనార్దన్‌రెడ్డి 91వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు శ్రీనివాసులు రెడ్డి, ప్రసాద్ రెడ్డి, చింతల శ్రీనివాసులు రెడ్డి, కౌన్సిలర్లు కళ్యాణి, సుభావళి, శ్రీనివాసులు, శంకరయ్య, నాయకులు దశరథ రామిరెడ్డి, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు ఫిర్యాదు చేసిన రైతులు

బాలాయపల్లి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: మండలంలోని జయంపు గ్రామంలో నిమ్మ తోటలోని కాపును కొందరు దొంగలు చోరీ చేస్తున్నట్లు రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎంతో కష్టపడి పండించిన నిమ్మకాయలను రాత్రి సమయంలో దొంగలు కోసుకొని చోరీ చేస్తున్నట్లు రైతులు వాపోయారు. నిమ్మకాయల ధరలు భారీగా పెరగడంతో కాయలను చోరీ చేస్తున్నట్లు వారు వాపోయారు. ఎంతగానో కష్టపడి నిమ్మ తోటలను పెంచి సాగు చేస్తేకాయలు చోరీ గురవుతున్నట్లు తెలిపారు.

నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి సీఐ

వెంకటగిరి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: నేటి సమాజంలో నేరాలు పెరుగుతు న్నాయని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పట్టణంలోని యువత, ప్రజలకు ఆయన అవగా హన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలు, హత్యలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. మత్తు పదార్థాలకు ఎవరు బానిస కాకూడదని చెప్పారు. నానాటికి సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయని వీటి పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరి ప్రాణానికి వారే రక్షణ కల్పించుకోవాలని సూచించారు.

పేదలకు వరం సీఎం సహాయ నిధి : ఎమ్మెల్యే

వెంకటగిరి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: సీఎం సహాయనిది పేదలకు ఒక వరం అని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి పట్టణంలో పేదలకు సీఎం సహాయ నిధి చెక్కు లను ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి వారిని పరా మర్శించి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయ నిధి నిధులను గత ప్రభుత్వం ఎవరికి ఇవ్వలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువనేత విద్యా, ఐటి శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ బాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో నియోజక వర్గంలో ప్రతి పేదవాడికి వైద్యం, విద్య మరియు సంక్షేమం అందేలా నిరంతరం శ్రమిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ పొనుకోటి విశ్వనాథం, మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్, పట్టణ అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

కమనీయం ప్రసన్న వెంకటేశ్వరుని కళ్యాణం

(ప్రభాతవార్త-శ్రీకాళహస్తిరూరల్)

శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం కళ్యాణోత్సవం కమనీయంగా కన్నుల పండువగా సాగింది. శుక్రవారం ఉదయం ఆలయంలో కళ్యాణ వేదికను ఏర్పాటు చేసారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తండోపతండా లుగా కదలి వచ్చారు.ఆలయ అర్చకులు రమణస్వామి, మాధవస్వామి, బాబూ స్వామిలు వేదికను చక్కగా ముస్తాబు చేసారు. కళ్యాణ వేదికను కన్నులు మిరుమిట్లు గొల్పునట్లు ముస్తాబు చేసారు.కళ్యాణ వ్యవస్థను ఈ తరం మరచి పోతున్న తరుణంలో యువతకు మార్గదర్శకంగా వేదికను ముస్తాబు చేసారు. మామిడి తోరణాలు అరటి చెట్టతో చక్కగా అలంకరించారు. హోమాలు నిర్వహించారు. స్వామి అమ్మవార్లను వధూవరులుగా ముస్తాబు చేసి ఆలయంలో ప్రదక్షిణలు చేసారు. తరువాత వేద పండితులు వేద మంత్రాలను పఠిస్తుండగా శాస్త్రోక్తంగా కళ్యాణోత్సంను నిర్వహించారు. ఏర్పాట్లును ఆలయ సూపరింటెండెంట్ జ్ఞాన ప్రకాష్, టెంపుల్ ఇన్స్పెక్టర్ సుధీర్, గ్రామానికి చెందిన ప్రముఖులు కందాటి శేఖర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి చెంగారెడ్డి సంజీవయ్యలు హాజరు కాగా చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రసన్న వెంకటేశ్వరుని కళ్యాణంను వీక్షించుటకు తరలి వచ్చారు.వచ్చిన భక్తులకు టిటిడి చక్కగా భోజన సదుపాయాలు ఏర్పాటు చేసారు.వచ్చిన ప్రతిభక్తునికి టిటిడి ప్రసాదాలను అందించింది.

గరుడసేవ:

ఉదయం స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించగా సాయంత్రం గరుడ సేవను అంగరంగ వైభవంగా నిర్వహించారు.వధూవరులను గరుడ వాహనంపై ప్రతిష్టించి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవాన్ని తిలకించుటకు చుట్టుపక్కల గ్రామాల నుంచి హాజరయ్యారు.

మట్టి మాఫియా కేరాఫ్‌గా డివి సత్రం

దొరవారిసత్రం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: మండల పరిధిలోని శుక్రవారం నెల్లూరుపల్లి గ్రామలో నడిమిచెరువు కొత్తగుంట చెరువులో మట్టి మాఫియా ఇష్టానుసారంగా మట్టిని తరలించకపోతుంటే చూస్తూ ఉండిపోతున్న రెవిన్యూ అధికారులు పోలీసు ఇతర మండలాలకు గ్రావిల్ మట్టి అధికార పార్టీ అండ దండలతో మట్టి మాఫియా రెచ్చిపోతుంటే చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. గతంలో కూడా పట్టుకున్న టిప్పర్లులును అతి తక్కువ ఫైన్ తో వదిలేశారు. గ్రామాల నుంచి ఎన్ని ఫిర్యాదులు అధికారులకు వచ్చిన పట్టించుకోవడంలేదని గ్రామా ల్లోని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మండల కబ్జాలకు మట్టి మాఫియాకు అడ్డాగా మారిపోయిందని. రెవెన్యూ అధికారులు ఉన్న లేనట్లుగానే ఉందని. మండలంలో కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమి కబ్జాలకు గురవుతూనే ఉంది. రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరు ఎత్తినట్టు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి మట్టి మాఫియాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సోమిరెడ్డి సన్మానించిన టిడిపి నేతలు

నాయుడుపేట, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా సన్మానిం చారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి శుక్రవారం నాయుడుపేట పట్టణంలోని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంలు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన రెడ్డికి శాలవాలు కప్పి సాదర స్వాగతం పలికారు. అనంతరం తెలుగుదేశం పార్టీ నాయకులు నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి సోమిరెడ్డికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయుడుపేట పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు పసల గంగా ప్రసాద్, మైలారి రాజశేఖర్, గాలి రమేష్ నాయుడు, గూడూరు సుధీర్‌రెడ్డి, నిత్యా కృష్ణారెడ్డి, బల్లి ముత్యాలయ్య, పలువురు నాయకులు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

సోమిరెడ్డి కలసిన మండల టిడిపి నేతలు

నాయుడుపేట, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని నాయుడుపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కామిరెడ్డి అశోక్ కుమార్‌రెడ్డి, చిట్టేటి చెంచయ్యలు మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి శుక్రవారం నాయుడుపేట పట్టణంలోని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం నివాసానికి విచ్చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయుడుపేట పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు పార్థసారథి, పేరంశెట్టి శ్రీరాం ప్రసాద్, వేలూరు మురళీకృష్ణ రెడ్డి, సంచి కృష్ణయ్య, పలువురు నాయకులు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

పశువుల షెడ్డు ప్రారంభోత్సవం

వాకాడు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: మండలం నెల్లిపూడి పంచాయతీ పరిధిలోని పల్లిపాలెంలో రెండు లక్షల ముప్పై రెండు వేల రూపాయలతో పశువుల షెడ్డును గురువారం మండల టిడిపి కన్వీనర్ మధుసూదన్ రెడ్డి, సన్నారెడ్డి విజయ శేఖర్ రెడ్డిలు రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సంచేశారు. ఈ సందర్భంగా టిడిపి మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా రెండు లక్షల, 32 వేల రూపాయలతో నిర్మాణంతో పశువుల షెడ్డును నిర్మించడం జరిగిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ సహకారంతో మండలం ఎంతో అభివృద్ధి జరుగుతుందన్నారు. రావిగొండపాలెం నుండి నిడి గుర్తి పంచాయతీ వరకు సుమారు మూడు కోట్ల రూపాయలతో ఆర్ అండ్ బి రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ ప్రారంభోత్స కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకుడు సన్నారెడ్డి విజయ శేఖర్ రెడ్డి, ఎంపీడీవో సాయిప్రసాద్, ఏపీఓ విజయ, ఎంబేటీ. పోలయ్య, మాజీ ఎంపీపీ పల్లాపల్లి వెంకటేశ్వర్లు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది మల్లికార్జున రావు, నాయకులు మహేష్ హరికృష్ణ రెడ్డి, రామయ్య తదితరులు ఉన్నారు.

త్రిశూలానికి పూజలు-ఉత్సవర్లకు అభిషేకాలు

(ప్రభాతవార్త-శ్రీకాళహస్తి)

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం త్రిశూలానికి పూజలు,అభిషేకాలు నిర్వహించారు. అలాగే ఉత్సవర్లకు వసంతోత్సవాన్ని అంగరంగ వైభవంగా కన్నుల పండువగా నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాయంలో నిర్వహించే ఉత్సవాల్లో ప్రత్యేకత సంతరించుకుంది. ఉమాదేవి సమేత చంద్రశేఖరుడు కొలువు దీరిన త్రిశూలాన్ని సూర్య పుష్కరిణి వద్ద మేళ తాళాలు మంగళవాయిద్యాలతో తీసుకెళ్ళారు. అక్కడ పవిత్ర జలంతో అభిషేకించి, పవిత్ర జలం కోసం పోటీ పడ్డారు. భక్తుల జయజయధ్వనుల మధ్య త్రిశూల స్నానాన్ని ఆలయ దీక్షా గురుకుల్, డాక్టర్ స్వామి గురుకుల్‌లు కార్యక్రమాల్ని నిర్వహించారు. ఉత్సవానికి ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఈకార్యక్రమాల్లో డాక్టర్ స్వామి నాథన్ గురుకుల్‌తో పాటు సూరి గురుకుల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్,బోర్డు సభ్యులు వాకచర్ల గుర్రప్పశెట్టి, మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

యాగశాలలో కలశోద్వాసన

(ప్రభాతవార్త-శ్రీకాళహస్తి)

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం నుంచి కార్యక్రమాల్లో అధికారులు, పాలకులు నిమగ్నమయ్యారు. శుక్రవారం ఉదయం యాగశాలలో ఏర్పాటు చేసిన కలశాలను ఉద్వాసన గావించారు. పది రోజుల పాటు యాగశాల వద్ద హోమాలు నిర్వహించారు. అక్కడే కలశ స్థాపన గావించి, కలశాలను ఉద్వాసన గావించారు. కలశాలను ఆలయ అర్చకులు ఆలయంలోని నాలుగు ద్వారాల వద్ద ఊరేగింపు జరిపి భక్తులకు దర్శనం కల్గించారు. ఈ కార్యక్రమాలలో ఆలయ చైర్మెన్ కొట్టె సాయి ప్రసాద్, మహిళా సభ్యులు హాజరు కాగా ఉత్సవాన్ని ఆలయ ప్రధాన అభిషేక గురుకుల్ డాక్టర్ స్వామినాథన్,ఆలయ ప్రధానర్చకులు సంబంధం గురుకుల్,అలయ పౌరోహితులు అర్థగిరి స్వామి అర్చకులు దక్షిణా మూర్తి నిరంజన్ వెంటరాగా ఆ నీటితో స్వామి అమ్మవార్ల ఉత్సవర్లను అభిషేకించారు. ఉత్సవాలను ఆలయ ఎఇఒ విద్యాసాగర్‌రెడ్డి, ఇన్స్పెక్టర్ సుదర్శనం పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న ఆశ్రిత కూచిపూడి

శ్రీకాళహస్తి-ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధూర్జటి కళాప్రాంగణంలో చిన్నారుల నృత్యప్రదర్వనలు ఆకట్టుకుంటున్నాయి. ఈ నేనపధ్యంలో శుక్రవారం పట్టణంలోని విఎం పల్లికి చెందిన ఆశితశ్రీ ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. అద్భుతంగా నాట్య ప్రదర్శన ఇచ్చిన ఆశితశ్రీకి ఆలయం వేదిక నిర్వాహకులు సత్కరించారు.

కైలాసానికి దిగివచ్చిన శివపార్వతులు

శ్రీకాళహస్తీశ్వరాలయం నిర్వహిస్తున్న మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం తిరుపతి కి చెందిన రిషాన్వి డాన్స్ అకాడమి ప్రదర్శించిన భూకైలాసం నృత్యప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. శిక్షకురాలు ఎస్,సునీత పర్యవేక్షణలో రిషితా శ్రీ,హాన్విశ్రీ,అక్షయశ్రీ, అవని, వినూత్న, మోక్షితలు ఎంతో చక్కగా ప్రదర్శించి ప్రసంశలందుకున్నారు. చిన్నారులను ఆలయ నిర్వాహకులు సత్కరించారు.

నేడు పల్లకి సేవా-పురజనులకు పండగ

(ప్రభాతవార్త-శ్రీకాళహస్తి)

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహోత్సవాలల్లో భాగంగా శనివారం రాత్రి స్వామిఅమ్మవార్ల పల్లకిసేవా నిర్వహించు చున్నారు. పురజనులకు ఇదో పండగ. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో పట్టణంలో నిర్వహించే చివరి ఉత్సవం ఇది. దాంతో ఈ ఉత్సవానికి సంబంధించి భక్త జనం విశేషంగా హాజరౌతారు. సోమాస్కంద మూర్తి అయిన స్వామిని ఓ పల్లకిలో దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారిని మరో పల్లకిలో ప్రతిష్టించి ఉత్సవం నిర్వహించటం అనవాయితి. స్థానికులకే పరిమితమైన ఈ ఉత్సవాల్లో నేడు పరిసర ప్రాంతాలకు చెందిన కనీసం 50 వేల మంది భక్తులకు పైగా పాల్గొంటారు. మహాశివరాత్రి బ్రహోత్సవాల్లో ప్రధాన ఉత్సవాలో పల్లకీ సేవా కూడా ఉంది.ఉత్సవాన్ని రాత్రి ఎనిమిది గంటలకు ప్రారంభించుటకు ఆలయాధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

కేడియంపై స్వామి అమ్మవార్ల రాజసం

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం స్వామి అమ్మవార్లు కేడియం వాహనంపై భక్తులకు దర్శన మిచ్చారు. ఉదయం ఆలయంలోని అలంకార మండపంలో యువ అర్చకులు రాజేష్ గురుకుల్, సురేష్ గురుకుల్ స్వామి అమ్మవార్లను ముస్తాబు చేసారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టె సాయి ప్రసాద్, సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టి మొదటి పూజలు అందించి గ్రామోత్సవానికి శ్రీకారం చుట్టారు. స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం కన్నుల పండువగా సాగింది. ఉత్సవాన్ని టెంపుల్ ఇన్స్పెక్టర్ వెంకటస్వామి, పర్యవేక్షకుడు నాగభూషణం యాదవ్‌లు పర్యవేక్షించారు.ఉత్సవానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

23 నుంచి ఎస్వీపిసెట్ సిల్వర్ జుబ్లీ వేడుకలు

-వైస్ ఛైర్మన్ రావూరి బాలాజీ

పుత్తూరు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త : మునిసిపాలిటీ పరిధిలోని చినరాజు కుప్పం వద్ద శ్రీ వేంకటేశ పెరుమాళ్ ఇంజనీరింగ్ కాలేజీ అండ్ టెక్నాలజీ (ఎస్‌విపిసెట్) స్థాపించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 23 నుంచి 28వ తేదీ వరకూ సిల్వర్ జుబ్లీ వేడుకలు నిర్వహిస్తు న్నట్టు సంస్థ వైస్ ఛైర్మన్ రావూరి బాలాజీ తెలిపారు. శుక్రవారం కాలేజీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2001వ సంవత్సరంలో ఎస్‌విపిసెట్‌ను స్థాపించామని అందరి సహకారంతో 25 సంవత్సరాలు దిగ్విజయంగా పూర్తి చేసుకున్నామని తెలిపారు. 23వ తేదీన కర్టెన్ రైజర్ నిర్వహించి వేడుకలను ఘనంగా ప్రారంభిస్తామన్నారు. 26వ తేదీ వరకూ విద్యార్థినీ, విద్యార్థులకు, అధ్యాపక బృందం, సిబ్బందికి క్రీడలు ఇతర వినోదాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. 27వ తేదీన కళాంజలి సంస్థ ఆధ్వర్యంలో ఫ్యాషన్ షో వుంటుందని, వివిధ రకాల ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. సిల్వర్ జుబ్లీ వేడుకల సందర్భంగా